
# ఆదివాసీ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను తిరస్కరిద్దాం



ఆదివాసీ ప్రజలారా! ఆలోచనాపరులారా!

చాలా ఆందోళన కలిగించే కరపత్రం ఒకటి ఈ మధ్య భద్రాచలం ఏజెన్సీలో ప్రత్యక్షమయింది. దీనిని ప్రచురించిన సంస్థ పేరు 'జనజాతి సురక్షామంచ్' (గిరిజన సంరక్షణ సమితి- ఆంధ్రప్రదేశ్) అట. క్రైస్తవ మతం పుచ్చుకున్న ఆదివాసులకు ఎస్‌టి రిజర్వేషన్ హక్కు వర్తింపజేయకూడదనేది ఈ కరపత్రం సారాంశం. ఇది ఆదివాసులను క్రైస్తవులు, క్రైస్తవేతరులుగా విభజించి అంతర్గత వైషమ్యాలకు కారణం అవుతుందనడంలో సందేహం లేదు.

ఆదివాసుల ఐక్యత అత్యవసరమయిన ప్రస్తుత స్థితిలో ఈ వైషమ్యాన్ని రాజేయడానికి పూనుకున్న ఈ 'మంచ్' వెనక ఉన్నదెవరు? ఒక పక్క పోలవరం ప్రాజెక్టు, మరొకపక్క సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు ఖమ్మం జిల్లాలోని 12 మండలాలలో ఆదివాసుల జీవితాలను కల్లోలమయం చేస్తున్నాయి. వాటిని ఎదుర్కొనడానికి కావలసిన సంకల్పం, ఐక్యత వివిధ కారణాలవల్ల ఇప్పటికే కొరవడ్డాయి. ఐక్యతను మరింత బలంగా పెంపొందించవలసిన ఈ దశలో మతం ప్రాతిపదికన ఆదివాసులను చీల్చి అనైక్యతను పెంపొందిస్తున్న వీరెవరు?



ఎస్‌టి రిజర్వేషన్లలో 70 శాతాన్ని క్రైస్తవం పుచ్చుకున్న 18 శాతం మంది పొందుతున్నారనీ, 82 శాతంగా ఉన్న 'అసలైన వెనుకబడ్డ బీద గిరిజనులు' 30 శాతం రిజర్వేషన్ మాత్రమే పొందుతున్నారనీ ఈ కరపత్రంలో అన్నారు. ఇవి ఎవరు తీసిన లెక్కలు? ఏ ప్రాంతానికి చెందినవి? ఏ జిల్లాకు చెందినవి? ఎప్పుడు తీసినవి? అసలు సత్యం ఏమిటంటే ఆదివాసీ ప్రజలకు ఉమ్మడిగా ఇచ్చిన రిజర్వేషన్ హక్కులో సింహభాగం ఏజెన్సీ ప్రాంతాలకు వెలుపల నివసించే తెగలు, వెలుపలి నుండి ఏజెన్సీలోకి ఈ మధ్యకాలంలో ప్రవేశించిన తెగలు పొందుతుండగా అనాదిగా ఏజెన్సీలో ఉంటున్న ఆదివాసులు చాలా తక్కువగా పొందుతున్నారు. దీనికి మతంతో ఏమీ సంబంధం లేదు. ఈ కారణంగా ఎస్‌టి రిజర్వేషన్‌కు వర్గీకరించాలని ఏజెన్సీలో నివసిస్తున్న ఆదివాసులు ఎప్పటినుండో డిమాండ్ చేస్తున్నారు. అది ఎవరి మీదా ద్వేషంతో చేస్తున్న డిమాండ్ కాదు. న్యాయం కోసం చేస్తున్నది. పైగా అది ఏజెన్సీ ఆదివాసుల ఐక్యతను బలపరిచే డిమాండు. వారి సంఘటిత శక్తిని పెంచే డిమాండు. దాని స్థానంలో ఐక్యతను బలహీనపరిచే ఈ డిమాండు ఎవరి ప్రయోజనాల కోసం తీసుకొస్తున్నారు?

మతం మార్చుకున్నా ఆదివాసులు ఆదివాసులుగానే గుర్తించబడతారని రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 కింద రాష్ట్రపతి జారీ చేసిన ఆదేశం చెప్తున్న సంగతి ఈ కరపత్రం వేసిన 'మంచ్'కు తెలుసు. అయితే ఆ ఆదేశాన్ని సవరించాలన్నది వీరి కోరిక. 'సుప్రీంకోర్టు చెప్పినా' ప్రభుత్వాలు సవరించడం లేదని అన్నారు. ఇది అబద్ధం. సుప్రీంకోర్టు ఎప్పుడు చెప్పింది? ఏ తీర్పులో చెప్పింది? అసలు రాష్ట్రపతి ఆదేశాన్ని సవరించమని ఆదేశించే అధికారం సుప్రీంకోర్టుకు లేదే. అధికారం లేని ఈ పని సుప్రీంకోర్టు ఎందుకు చేస్తుంది?

'హరిజనుల్లో మతం మారితే ఎస్‌సి జాబితానుండి తొలగించివేస్తారు. మరి గిరిజనులకు అలా ఎందుకు లేదు?'' అని ఈ కరపత్రం ప్రశ్నిస్తుంది. దళితులు ఏ మతానికి మారినా ఎస్‌సి రిజర్వేషన్ కోల్పోరు. బౌద్ధం, సిక్కు, జైన మతాలకు మారితే ఎస్‌సిలుగానే కొనసాగుతారు. క్రైస్తవం, ఇస్లాం పుచ్చుకుంటేనే ఎస్‌సి హోదా కోల్పోతారు. ఈ వివక్ష అన్యాయమనీ, దళిత క్రైస్తవులనూ దళిత ముస్లింలనూ కూడ ఎస్‌సిలుగా గుర్తించాలనీ ఇవ్వాళ దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజాతంత్ర శక్తులు సమర్థిస్తున్నాయి. దానికి విరుద్ధంగా ఆ వివక్షను ఆదివాసులలో ప్రవేశపెట్టాలని కోరడం ఏమిటి?

'మతం మారిన గిరిజనులు అటు అల్పసంఖ్యాకుల (మైనారిటీల) పేర, ఇటు గిరిజనుల పేర రెండు రకాల ప్రభుత్వ సౌకర్యాలు పొందుతున్నారు' అని ఈ కరపత్రం అంటుంది. మైనారిటీలుగా వారు పొందుతున్న 'ప్రభుత్వ సౌకర్యాలు' ఏమిటి? ఒక్కటైనా

చెప్పగలరా? మైనారిటీలకు మైనారిటీలుగా భారతదేశంలో ఉన్న హక్కు ఒక్కటే. అది తమ సంస్కృతినీ, సంప్రదాయాలనూ కాపాడుకునే హక్కు, తమ స్వంత విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకునే హక్కు. అయినా క్రైస్తవులెక్కడా కేవలం క్రైస్తవులకోసమే విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకోలేదు. క్రైస్తవ విద్యాసంస్థలలో అందరికీ ఎప్పుడూ సమానంగా ప్రవేశం ఉంది.

'గిరిజనుల మౌలిక విశ్వాసాలను, సంస్కృతిని, పరంపరాగత ఆచార వ్యవహారాలను పరిరక్షించి నిలపడమేతమ లక్ష్యం అని ఈ కరపత్రం వేసిన వారు అంటున్నారు. అది గౌరవించదగ్గ ఆలోచనే. ఒకపక్క ప్రాజెక్టులు, గనులు, పరిశ్రమల కోసం భూసేకరణ, మరొకపక్క గిరిజనేతరుల భూమి దాహం ఆదివాసుల ఉనికిపైన పెద్దెత్తున దాడి చేస్తున్నప్పుడు ఆదివాసులు ఒక్కటిగా నిలబడి ప్రతిఘటించాలంటే తమ సాంస్కృతిక గుర్తింపునూ ప్రత్యేకతనూ కాపాడుకోవడం చాలా అవసరం. అయితే దీనికి క్రైస్తవ మత మార్పిడి ఒక్కటే విరోధి ఎందుకయింది? ఆదివాసుల 'పరంపరాగత ఆచార వ్యవహారాలకు' వ్యతిరేకంగా ఎన్ని హైందవ ఆచారాలూ, ఆలోచనలూ ఇవాళ ఆదివాసుల సంస్కృతిలోకి ప్రవేశించలేదు? పట్టణాలలో ఉద్యోగరీత్యా ఉంటున్న ఆదివాసులు పెళ్లిళ్లు, పండగలు ఆదివాసుల ఆచారం ప్రకారం కాక హైందవ సంస్కృతిని అనుసరించి చేసుకోవడం లేదా? ఇవాళ్టి ఆదివాసీ యువతరానికి హైందవ పురాణాలతో ఉన్న పరిచయం ఆదివాసీ గాధలతో ఉందా? ఇంకొంచెం చదువుకొని పెద్ద ఊర్లలో ఉంటున్నవారు పాశ్చాత్య సాంస్కృతిక రీతులకు లోనుకావడం లేదా? ఒక్క క్రైస్తవ మత మార్పిడినే ఎందుకు వేలెత్తి చూపాలి? భద్రాచలం హైందవ పుణ్యక్షేత్రం కాబట్టి ఆ ఊరినీ దానిచుట్టూ 10 కిలోమీటర్ల ప్రాంతాన్నీ ఏజెన్సీ చట్టాల పరిధినుండి తొలగించాలని ఆ ఊరిలోని గిరిజనేతరులు చేస్తున్న డిమాండు ఆదివాసీ ప్రజల ఉనికిపైన, అస్తిత్వంపైన దాడికాదా? దాని గురించి ఈ 'మంచ్' ఏమంటుంది?

ఆదివాసీ ప్రజల ఐక్యత నిమిత్తం ఆదివాసీ సంస్కృతిపైన ఉన్న అన్ని అన్య ప్రభావాలనూ తిరస్కరించడానికి ఎవరైనా సూత్రబద్ధంగా కృషి చేసినట్టయితే, దాని సాధ్యాసాధ్యాల గురించి ఎంత సందేహం ఉన్నా ఆ కృషిని ఆదివాసీ ప్రజల మేలు కోరేవారందరూ గౌరవిస్తారు. కానీ ఒక్క క్రైస్తవాన్ని వేరుచేసి దానిపైన దాడిచేసే వైఖరిని హర్షించలేము.

ఎవరో తెలిసో తెలియకో ఒక కరపత్రం వేస్తే దాని గురించి ఇంత చర్చ ఎందుకంటారేమో. ఇది తెలిసో తెలియకో వేసిన కరపత్రం కాదు. ఆదివాసీ సమాజాన్ని తమ అదుపులోకి తెచ్చుకోవడం కోసం దానిని రెండు వర్గాలుగా చీల్చి ఘర్షణలు పెట్టి హింసను రెచ్చగొట్టే అజెండా మన దేశంలో చాలా చోట్ల ఇప్పటికే అమలవుతున్నది. దీని వెనక ఉన్నది ఆర్ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్. ఛత్తీస్‌గఢ్‌లో అది సల్వాజుడుం రూపం తీసుకుంది. దానిని మొదలుపెట్టింది కాంగ్రెస్ నాయకుడయినా అది ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న విషయం తెలిసిందే. బిజెపి నాయకుడు వెంకయ్య నాయుడు మొన్నటి ఎన్నికలప్పుడు దేశంలో వారి కూటమిగానీ అధికారంలోకి వచ్చినట్టయితే సల్వాజుడుంను ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏర్పాటు చేస్తామన్నాడు. అది జరిగినట్టయితే ఎంత చేటు చేయగలదో భద్రాచలం ప్రాంతవాసులకు తెలుసు. ఎందుకంటే సల్వాజుడుం బాధితులు పెద్ద సంఖ్యలో భద్రాచలం డివిజన్‌కు వలస వచ్చి చావలేక బతుకుతున్న దీనస్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. ఒరిస్సా రాష్ట్రం కందమాల్ జిల్లాలో అదే అజెండా వేరొక రూపంలో అమలయింది. ఆదివాసులను దళిత క్రైస్తవులపైకి రెచ్చగొట్టి అమానుషంగా దాడులు చేయించారు. అధికారిక లెక్కల ప్రకారమే 39 ప్రాణాలు పోయాయి, వేలమంది బలవంతంగా నిర్వాసితులయ్యారు.

ఆ అజెండా మరొక రూపంలో భద్రాచలంలో అమలు కావాలని మనం కోరుకుంటున్నామా? ఆదివాసీ సమాజం క్రైస్తవులు-క్రైస్తవేతరులు అంటూ రెండుగా చీలి ఘర్షించుకోవాలని కాంక్షిస్తున్నామా? ఆదివాసులలో ఈ సంఘర్షణ ఎవరికి మేలు చేస్తుంది? ఎల్‌టిఆర్ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తున్న గిరిజనేతరులకు, ఆదివాసీ ప్రాంతాన్ని బలవంతంగా ఖాళీ చేసి ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులు విస్తారంగా నెలకొల్పాలని చూస్తున్న సింగరేణి బొగ్గు గనుల కంపెనీకి, ఏడు ఏజెన్సీ మండలాలను ముంచి కింది ప్రాంతానికి నీళ్లిచ్చే పోలవరం డ్యాం కడుతున్న ప్రభుత్వానికి తప్ప ఆదివాసులకేమైనా మేలు చేస్తుందా?

ఆలోచించమనీ, విచ్ఛిన్నకరమైన ఇటువంటి ప్రయత్నాలను తిరస్కరించమనీ ఆదివాసీ ప్రజానీకానికి మేము విజ్ఞప్తి చేస్తున్నాం.

**మానవహక్కుల వేదిక (HRF)**

28 జూన్, 2009

ఖమ్మం జిల్లాశాఖ

ప్రచురణకర్త : కె. బాలగోపాల్, 301, శ్రీరామ్ రెసిడెన్సీ, ప్రియా కాలనీ, గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 028. ఫోన్: 040-23537969